## గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా సక్రు నాయక్



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా హయత్ నగర్‌కు చెందిన రమావత్ సక్రు నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా గిరిజన సమాఖ్య 3వ జిల్లా మహాసభను రాజేందర్ నగర్‌లో నిర్వహించారు. ఈ మహాసభలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహసభలో రంగారెడ్డి జిల్లా గిరిజన సమాఖ్య నూతన జనరల్ బాడీని 21 మందితో కూడిన నూతన కౌన్సిల్ ఏన్నుకోవడం జరిగింది.

## అర్హులైన యువతీయువకులు ఓటు నమోదు చేసుకోవాలి



ప్రజాపోం/ఇబ్రహీంపట్నం : అర్హులైన యువతీ యువకులు ఓటర్ జాబితాలో పేర్లను నమోదు చేసుకోవాలని ఆర్‌డిఓ శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఇబ్రహీంపట్నం ఆర్‌డిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో ఎంపికైన బిఎల్‌ఓలు ఈ నెల 25వ తేది నుండి వచ్చె నెల 24వ తేది వరకు ఇంటింటా సర్వే నిర్వహించనున్నారు కావు ప్రతి ఒకరు ఈ అవకాశాన్ని సదున్వియోగం చేసుకోవాలని సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : సైబారాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సైబారాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ సృజన సైబారాబాద్ పరిధీలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పౌరులు, ప్రజా సంఘాలు, కాలనీవాసుల నుంచి వినతులు స్వీకరించారు. మొత్త 47 ఫిర్యాదులు అందగా శాఖల వారీగా టౌన్ ప్లానింగ్ 40, ఇంజనీరింగ్ 4, రియల్ ఎస్టేట్ 1, పారిశుద్యం 1,అర్బన్ బయోడైవర్సిటీ 1 ఫిర్యాదులు అందాయని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ సృజన తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి




ప్రజాపక్షం/షాద్‌నగర్: ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప సూచించారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని బివిరావు నగర్ పౌల్ట్రిఫాం, రైస్ మిల్లులో పని చేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన సుమారు 60మంది చిన్నారులను మండల విద్యా శాఖ అధికారి మనోహార్ నేతృత్వంలో గుర్తించి పాఠశాలలో చేర్పించారు. ఈ విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలను, బ్యాగులు, పలక, బలపంను మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్ చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్, ఫౌల్ట్రి ఫెడరేషన్ నాయకుడు పాతూరి వెంకట్ రావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు గౌడ్, ఫరూఖ్‌నగర్ మండల కార్యదర్శి బిజిలి సత్యం, యుటిఎఫ్ నాయకులు సురేష్ గౌడ్, సత్యం, పిఆర్‌టియు నాయకులు అంజునాయక్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, విష్ణు, తిరుమలయ్య, సిఆర్పీలు రాధాకృష్ణ, భాగ్యలక్ష్మీ , నాగమణి, ఉష, పాండు, కార్మిక సంక్షేమ సంఘం నేత పినపాక ప్రభాకర్ పాల్గొన్నారు.

## ముగిసిన మండల స్థాయి క్రీడలు



ప్రజాపక్షం/కొత్తూరు: మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో పురుషుల విభాగం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో కొత్తూరు, నందిగామ మండలాలకు చెందిన పలు క్రికెట్ జట్లు పాల్గొన్నారు. టోర్నమెంట్‌లో విజేత జట్టు కొత్తూరు, రన్నర్ జట్టుగా పెంజర్ల జట్లకు యునైటెడ్ వే హైద్రాబాద్, మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు బహుమతులు అందించారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో మహిళల విభాగంలో వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను సైతం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ముగింపు వేడుకలకు యునైటెడ్ వే హైద్రాబాద్‌చ మైక్రోసాఫ్ట్ సంస్థల ఉన్నతాధికారులతోపాటు స్థానిక నాయకులు నవీన్‌చారి, కర్రోళ్ల సురేందర్, వీరమోని శివలు హాజరై విజేదలకు విన్నర్ ట్రోఫీ, రన్నర్ జట్లకు ఆకర్షణీయమైన ట్రోఫీలను అందజేశారు.

## పంచాయతీల అభివృద్ధే లక్ష్యం




ప్రజాపక్షం/షాద్‌నగర్: గ్రామ పంచాయతీల అభివృద్ధియే లక్ష్యంగా పని చేస్తానని షాద్‌నగర్ నియోజకవర్గ ఉప సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మల్కయ్యగారి గోవర్ధన్‌రెడ్డి వివరించారు. సోమవారం షాద్‌నగర్‌లో డివిజన్‌లోని ఆరు మండలాల ఉప సర్పంచుల కమిటీలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి డివిజన్ స్థాయి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని శేరిగూడ ఉప సర్పంచ్ మల్కయ్యగారి గోవర్ధన్ రెడ్డిని ఉప సర్పంచుల సంఘం డివిజన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎలుగని రాములు గౌడ్ (మక్తగూడ), ప్రధాన కార్యదర్శులుగా గుడ్డోల అభినవ్ (ఎలికట్ట), ఇస్నాతి గంగాధర్ (హాజీపల్లి), కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా ఎల్.గోపాల్‌రెడ్డి (శ్రీనివాసుల గూడ), ఉపాధ్యక్షులుగా యారం రాంరెడ్డి (సుందరాపురం), ఆవుల సిద్దయ్య యాదవ్ (నర్సప్పగూడ), వెంకటేష్‌గౌడ్ (లక్ష్మీ దేవిపల్లి)లు ఎన్నికయ్యారు.

# కారుణ్య నియామకాల ప్రక్రియ పూర్తిచేయాలి

పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో పదోన్నతులు కల్పించాలి
ఎస్‌సి, ఎస్‌టి కమిషనర్ చైర్మన్ బి.వెంకటయ్య




ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలోని మీటింగ్ హాల్లో సోమవారం ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ బి.వెంకటయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషన్ సభ్యులు కె.నీలాదేవి, రాంబాబునాయక్, కె.లక్ష్మి నారాయణ, జె.శంకర్, ఆర్.ప్రవీణ్ పాల్గొన్నారు. సమావేశానికి జిహెచ్ ఎంసికి చెందిన అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. సమావేశంలో ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు చెందిన ఉద్యోగుల సంక్షేమం, సేవా అంశాలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో పదోన్నతులు కల్పించాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. కారుణ్య నియామకాల ప్రక్రియను మరింత వేగవంతం చేసి, అర్హులైన కుటుంబాలకు త్వరితగతిన ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సేవా సంబంధిత ఇబ్బందులను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు సంబంధించిన సంక్షేమ చర్యలు అమలు విషయంలో జాప్యం చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

### ఎంఎస్ఎంయూ-ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో చైర్మన్‌కు సన్మానం

జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బి. వెంకటయ్యకు మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ (ఎంఎస్ఎంయు), ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. జిహెచ్ఎంసికి చెందిన ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలతో సమావేశం నిమిత్తం ఆయన ప్రధాన కార్యాలయానికి వచ్చిన సందర్భంగా సన్మానం చేశారు. ఎంఎస్ఎంయు, ఐఎన్‌టియుసి ఎస్‌సి, ఎస్‌టి కమిటీ అధ్యక్షుడు కె. శివకుమార్ చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అదిల్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి ఏ.వి.ఎస్. గాంధీ, మహిళా విభాగం చైర్పర్సన్ ఎల్.మెర్సీ, కార్యదర్శి పల్లవి, రెవెన్యూ విభాగం అధ్యక్షుడు శివాజీ, కార్యదర్శి జీవన్, పి.ఎస్.ఉమేశ్‌బాబు, సయ్యద్ ఇస్లాముద్దీన్ పాల్గొన్నారు.

## వరద ముప్పుపై హైడ్రా ప్రజావాణికి 47 ఫిర్యాదులు



ప్రజాపక్షం/హైదరాబాద్ : వర్షాకాలం నేపథ్యంలో నగర శివార్లలో పెరుగుతున్న వరద ముప్పుపై ఆందోళన వ్యక్తం చేస్తూ సోమవారం నిర్వహించిన హైడ్రా ప్రజావాణిలో మొత్తం 47 ఫిర్యాదులు అందాయి. వరద కాలువలు, మురుగు కాలువలను వేర్వేరుగా ఉంచి, వరదనీరు నేరుగా చెరువులకు చేరేలా సమగ్ర ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని పౌరులు కోరారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సమక్షంలో జరిగిన ప్రజావాణిలో పలు కాలనీల నివాసితులు వరద కాలువల నిర్మాణంలో సమన్వయ లోపాల వల్ల భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రహదారులు నిర్మించే సమయంలోనే ఇరువైపులా ఎత్తుపల్లాలు లేకుండా వరద కాలువలు ఏర్పాటు చేసి, వాటి నీరు చివరకు చెరువులు లేదా ప్రధాన కాలువలకు చేరేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. మియాపూర్– గండిమైసమ్మను కలుపుతూ నిర్మిస్తున్న ఆరు లైన్ల రహదారికి ఆనుకుని ఇరువైపులా నిర్మిస్తున్న ప్రధాన వరద కాలువలను ప్రగతినగర్‌లోని చిన్న సామర్థ్యపు పైపులకు అనుసంధానం చేయడం వల్ల భవిష్యత్తులో భారీ వరద ముప్పు ఏర్పడుతుందని స్థానికులు ఫిర్యాదు చేశారు. 1200 ఎంఎం చొప్పున రెండు వైపులా ఉన్న వరద కాలువల నీటిని 200 ఎంఎం పైపుల ద్వారా మళ్లించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని హైడ్రాను కోరారు. రంగనాథ్ వాటిని పరిశీలించి తదుపరి చర్యలకు ఆదేశించారు.

# ఆధునిక స్ట్రీట్ ఫుడ్ హబ్‌లకు ప్రతిపాదనలు



కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులతో సిఎంసి కమిషనర్ భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రధానమంత్రి స్వనిధి పథకం అమలులో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) పరిధిలో ఆధునిక స్ట్రీట్ ఫుడ్ హబ్‌ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీకి చెందిన అనిల్ ప్రకాష్, విజయవాడ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చెందిన జయేష్ కుమార్ సోమవారం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి కమిషనర్ డాక్టర్ జి.సృజన, అదనపు కమిషనర్‌లతో సమావేశమయ్యారు. సమావేశంలో స్ట్రీట్ ఫుడ్ హబ్‌ల రూపకల్పన, అభివృద్ధి, నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. ప్రతిపాదిత హబ్‌లలో పరిశుభ్రమైన, సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని అందుబాటు ధరల్లో అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఆటో డ్రైవర్లు, కార్మికులు, విద్యార్థులు, కుటుంబాలు, సాధారణ ప్రజలు ఒకే వేదికపై నాణ్యమైన ఆహారాన్ని ఆస్వాదించేలా వీటిని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వీటి ద్వారా వీధి వ్యాపారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు స్థానిక వ్యాపారాభివృద్ధికి ఊతమివ్వడంతో పాటు పౌరులకు పరిశుభ్రమైన, ఆకర్షణీయమైన ప్రజా వేదికలు అందుబాటులోకి వస్తాయని కమిషనర్ అన్నారు. అనంతరం ప్రతిపాదిత మల్కం చెరువు ప్రాంతాన్ని బృందం పరిశీలించి, పర్యాటక ప్రాంతాలతో అనుసంధానం, ప్రత్యేక బస్సు సౌకర్యాల అంశాలపై చర్చించారు.



### రంగానగర్‌లో కమిషనర్ క్షేత్రస్థాయి తనిఖీ

సిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన చింతల్ సర్కిల్ పరిధిలోని రంగానగర్ ప్రాంతంలో క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించి స్థానిక పౌర సమస్యలు, మౌలిక వసతుల అవసరాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నివాసితులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులతో కమిషనర్ ప్రత్యక్షంగా మాట్లాడారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన నీటి నిల్వ ప్రాంతాలను తక్షణమే పరిష్కరించాలని, టౌన్ ప్లానింగ్, మెయింటెనెన్స్ విభాగాలు సమన్వయంతో పని చేసి అత్యవసర చర్యలు చేపట్టాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ డస్ట్‌బిన్‌లను వినియోగిస్తున్న పౌరులు, వ్యాపారులను కమిషనర్ అభినందించారు. వాణిజ్య ప్రాంతాల్లో పరిశుభ్రతను ప్రోత్సహించేందుకు ఘన వ్యర్థాల నిర్వహణ విభాగం చేపట్టిన 'నో బిన్ – నో ట్రేడ్' అవగాహన కార్యక్రమాన్ని ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై సమస్యలను గుర్తించి, వేగంగా పరిష్కారాలు అందించడం ద్వారా మెరుగైన పౌరసేవలు అందించడమే కార్పొరేషన్ లక్ష్యమన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత



కలెక్టర్ నారాయణ రెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి: బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలు, పిల్లలు, ప్రజల సంక్షేమం కోసం అందుబాటులో ఉన్న వివిధ హెల్ప్‌లైన్ సేవల సమాచార బోర్డును కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి, సంక్షేమ అధికారి శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి పి.సురేష్ మోహన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రాజేశ్వర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, అత్యవసర సేవల హెల్ప్‌లైన్ 112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, డ్రగ్ డీఅడిక్షన్ హెల్ప్ లైన్ 1908 /14446, దివ్యాంగుల హెల్ప్‌లైన్ 18005728980, ట్రాన్స్‌జెండర్ హెల్ప్‌లైన్ 155326/14427తో పాటు సీనియర్ సిటిజన్స్ హెల్ప్‌లైన్ 14567 వంటి సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించుటకు గ్రామపంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, మున్సిపాలిటీలలో ఈహెల్ప్‌లైన్ నంబర్ల సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. బాలికల విద్యాభివృద్ధి, రక్షణ, సాధికారతకు ప్రతిఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా డబుల్ ఇండ్ల పంపిణీ

బిఆర్‌ఎస్ శాసన సభపక్ష ఉపనేత సబితా ఇంద్రారెడ్డి వినతి



ప్రజాపక్షం/రంగారెడ్డి: డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలని మాజీ మంత్రి,బిఆర్‌ఎస్ శాసన సభపక్ష ఉపనేత పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జిల్లాలో అర్హులైన ప్రతిలబ్ధిదారునికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను రాజకీయాలకు అతీతంగా, పూర్తిస్థాయి పారదర్శకతతో అందజేయాలని కోరుతూ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంఎల్ సి.సురభి వాణి దేవి, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, అంజయ్య యాదవ్‌తో కలిసి సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవనం అందించాలనే లక్ష్యంతో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీలో ఎలాంటి వివక్ష,ఆలస్యం లేదా రాజకీయ ప్రాధాన్యతలకు అవకాశం ఉండకూడదన్నారు.నిజంగా అర్హత కలిగిన కుటుంబాలకు మాత్రమే ఇండ్లు అందేలా స్పష్టమైన ప్రమాణాలతో ఎంపిక ప్రక్రియ చేపట్టాలని అధికారులను కోరారు. రంగారెడ్డి జిల్లాలో ఎంతోకాలంగా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న వేలాది కుటుంబాల ఆశలను ప్రభుత్వం గౌరవించాలని, లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలన్నారు. ప్రజల్లో అనుమానాలకు తావులేకుండా అర్హుల జాబితాలను బహిరంగంగా ప్రకటించి, న్యాయమైన విధానంలో ఇండ్ల కేటాయింపు జరగాలని సూచించారు. అదేవిధంగా "ప్రభుత్వ పథకాలు ప్రజల హక్కులు, వాటి అమలులో రాజకీయాలు కాకుండా అర్హతే ప్రమాణంగా ఉండాలని, ప్రతి అర్హుడికి న్యాయం జరిగే వరకు ప్రజల తరఫున మా పోరాటం కొనసాగుతుందని సబితా ఇంద్రారెడ్డి స్పష్టచేశారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్‌బినగర్ చౌరస్తాలో స్కైవాక్ పనులు పరిశీలించిన మధుయాష్కీ



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: ఎల్‌బి నగర్ రింగ్ రోడ్డు చౌరస్తాలో స్కైవాక్ ఏర్పాటు చేస్తున్నట్లు టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఎల్‌బి నగర్ చౌరస్తాలో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు, నాయకులతో కలిసి మధుయాష్కీ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ ఎల్‌బి నగర్ రింగ్ రోడ్డులో స్కైవాక్ నిర్మాణంతో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని, ప్రజలకు రోడ్డు దాటే అవస్థలు తప్పుతాయన్నారు. మెట్రో స్టేషన్ నుంచి నేరుగా నాలుగు వైపులా ప్రజలు వెళ్లేలా స్కైవాక్ నిర్మాణం ఉంటుదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, బిఎన్‌రెడ్డి నగర్‌లో ఏకో పార్కు పనులకు శంకుస్థాపన చేసిన సిఎం, తాగా స్కైవాక్ నిర్మాణానికి అనుమతులు ఇస్తూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అంతేకాకుండా ఎల్‌బి నగర్ రింగ్ రోడ్డులో వర్షం నీరు నిలువకుండా వరద నీటి పైప్‌లైన్ నిర్మాణం, బ్యూటిఫికేషన్ పనులు, రింగ్ రోడ్డు వద్ద సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ఇఇ కార్తీక్, డిఇ కనకయ్య, యాదవ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్ గౌడ్, ముద్దగొని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్, నర్సింహా యాదవ్, సదాశివుడు, బుడ్డ సత్యనారాయణ, వేణుగోపాల్ యాదవ్, రవీందర్‌గౌడ్, స్వర్ణ మాధవి, పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, పన్యాల జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌కు మొండిగౌరేల్లి రైతుల వినతి

ప్రజాపక్షం/యాచారం : మొండిగౌరేల్లి గ్రామంలో భూముల వాల్యువేషన్ పెరిగినందున పెరిగిన ధరతో బాటు కబ్జాలో ఉన్న వారికి నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ సోమవారం గ్రామ సర్పంచ్ కోలన్ రమాదేవి మల్లారెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్, డిఆర్ఓ అనంతరెడ్డి, ఇబ్రహింపట్నం ఆర్డిఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ భూములు సర్వేనంబర్ 19,68,127లో దాదాపు 660 ఎకరాల భూములను ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. గ్రామంలో జరిగిన సర్వేకు రైతులందరు సహకరించారన్నారు. పెరిగిన మార్కెటు విలువ ప్రకారం ఎకరాకి 60 లక్షల రూపాయలు ప్లాటు ఇవ్వాలని కబ్జాలో ఉన్న వారికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బడే కుమార్, వార్డు మెంబర్లు రవిందర్, విజయలక్ష్మి, మంగమ్మ, అరుణ, బి.యాదయ్య, ఎం.కిష్టయ్య పాల్గొన్నారు.



# అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలి

సిపిఐ డిమాండ్




ప్రజాపక్షం/తుర్కయంజాల్ : ఇందిరమ్మ పథకంలో ఎల్ 2 లబ్ధిదారులకి వెంటనే సర్వే పూర్తి చేసి అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆదిపట్ల సర్కిల్ కార్యాలయం రాగన్నగూడలో సిపిఐ ఆదిభట్ల సర్కిల్ కార్యదర్శి కాటంరాజు గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య హాజరై మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల సర్వే లబ్ధిదారుల విషయంలో అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి పక్షపాతి ధోరణితో అర్హులైన పేదలను సర్వే చేయకుండా విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఇండ్ల కేటాయింపుల్లో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుంటుందని అధికారులు పైరవీకారులు చూయించిన పేర్లను సిఫారసు చేస్తున్నారని వెంటనే సరి చేయవలసిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. ప్రలోభలకు తలొగ్గి పక్షపాత ధోరణితో సర్వే చేసిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సర్వేలో లోటుపాట్లను సరి చేయకపోతే ఆదిభట్ల సర్కిల్ కార్యాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు పి.శివకుమార్‌గౌడ్, శివ ప్రసాద్, నాగేశ్వర్, రోజ, భాస్కర్, పుంజ శివ తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమ స్థానంలో ప్రైవేట్ పాఠశాల ఏర్పాటు

### చర్యలు తీసుకోవాలంటూ ఎఐవైఎఫ్ ధర్నా

**ప్రజాపక్షం/ఉప్పల్ :** నాచారం పారిశ్రామిక ప్రాంతాల్లో విద్యాశాఖ అనుమతులు నడుస్తున్న ఎస్ఆర్ డిజి పాఠశాలను వెంటనే సీజ్ చేసి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. సోమవారం పాఠశాల ఎదుట ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి. సత్యప్రసాద్‌ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల కోసం ప్రభుత్వం అనేక రాయితీలతో కేటాయించిన స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా ఈ పాఠశాల ఏర్పాటు చేసారని, సదరు పాఠశాల యాజమాన్యంతో పాటు అక్కడ విద్యాశాఖ అనుమతులు లేకుండానే కాలుష్యం మధ్య పాఠశాల ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక దళ శాఖలు సైతం ఈ పాఠశాలకు అనుమతులు ఇవ్వలేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ధర్నాకు స్పందించిన ఉప్పల్ మండల విద్యాశాఖాధికారి రామారావు పాఠశాల విషయంపై ప్రిన్సిపాల్‌కు నోటీసులు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నేతలు అలీ, సుధీర్, కిరణ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.






## మాదకద్రవ్యాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలను, భవిష్యత్తులో ఎదురయ్యే స్థితిగతులపై విద్యార్థులకు అవగాహన కల్పించామని తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ ఇన్‌స్పెక్టర్ గురువయ్య అన్నారు. సోమవారం అలియాబాద్ మున్సిపాలిటి మజీద్‌పూర్‌లోని దక్ష కళాశాలలోని సుమారు 200మంది విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ గురువయ్య మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వలన ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని, చదువుపై ఆసక్తి లేకుండా పోతుందని అన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు సంబంధించిన ఏమైన అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్ వాడటం వలన మెదడు పనితీరు దెబ్బతింటుందని, గుండె, కాలేయం, ఊపిరితిత్తుల సమస్యలు వస్తాయని చెప్పారు. మానసిక ఆందోళన, డిప్రెషన్ భయాందోళనలు పెరుగుతాయన్నారు. అధిక మోతాదులో డ్రగ్స్ తీసుకుంటే ప్రాణపాయం సంభవిస్తుందని హెచ్చరించారు. చదువులో వెనకబడతారని, ఉద్యోగంలో పనితీరు తగ్గుతుందని చెప్పారు. కుటుంబ సభ్యులతో విభేదాలు పెరుగుతాయని, స్నేహితులతో, సమాజంలో గౌరవం కోల్పోతారని అన్నారు. డ్రగ్స్‌కోసం విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేస్తారని దీంతో అప్పులు పెరిగి ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. డ్రగ్స్ అమ్మడం, కొనడం చట్టపరంగా నేరమని ఒకవేళ ఎవరైన చట్టాలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.



## మష్రూమ్ సాగుతో బంగారు భవిష్యత్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** పుట్టగొడుగుల సాగు ద్వారా యువత ఉపాధి, వ్యాపార అవకాశాలను సృష్టించుకోవచ్చని నిపుణులు సూచించారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాస్త్రాల పాఠశాలలో పుట్టగొడుగుల సాగు ద్వారా వ్యవసాయ పారిశ్రామిక అభివృద్ధి అంశంపై మూడు రోజుల అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోధనా సిబ్బంది, విద్యార్థులు పారిశ్రామికవేత్తలకు పుట్టగొడుగుల సాగు పద్ధతులు వ్యాపార అవకాశాలు పోషక ఔషధ విలువలు తెగుళ్ల నివారణ ప్రాసెసింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. ఓయిస్టర్ మిల్కీ పుట్టగొడుగులసాగుపై ప్రత్యక్ష శిక్షణ కూడా అందించారు. డాక్టర్ ఎంపి. ఠాకూర్ పుట్టగొడుగుల విత్తన ఉత్పత్తిలో ఉన్న అవకాశాలను వివరించగా డాక్టర్ విజయ ఖాదర్ పుట్టగొడుగుల ఆరోగ్య ప్రయోజనాలను తెలియజేశారు. పారిశ్రామికవేత్త ప్రీతి తన విజయ అనుభవాలను పంచుకోగా డాక్టర్ స్వాతి, డాక్టర్ రవి, లక్ష్మీ నారాయణ, డా.రవీందర్ రెడ్డి, డా.దివాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భూ కబ్జాలకు కేరాఫ్ అడ్రస్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద

### మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భూ కబ్జాలకు కేరాఫ్ అడ్రస్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద అని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ విమర్శించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మల్కాజిగిరి డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్యే వివేకానంద ఇంకోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే కుత్బుల్లాపూర్‌లో తిరగనీయమని హెచ్చరించారు. కుత్బుల్లాపూర్‌లో ప్రభుత్వ భూములన్నీ కెటిఆర్, హరీష్ రావులకు అమ్మించిన ఘనత వివేకానంద స్వంతమని వాఖ్యానించారు. మైనంపల్లి హనుమంతరావు గురించి మాట్లాడే స్థాయి వివేకానందకు లేదని, ఆయన దొంగ చాటున గెలిచిన దొంగ ఎమ్మెల్యే అని, మూడు సార్లు గెలిచిన కుత్బుల్లాపూర్‌కు చేసింది ఏమి లేదని విమర్శించారు. తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ వివేకానంద చాటున మా ముఖ్యమంత్రి కాళ్లు మొక్కుతడు, బయటకు వచ్చి ముఖ్యమంత్రిని తిడతాడు అని చెప్పారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి బిఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని నిలువునా దోచుకొని, పంది కొక్కుల్లాగా మెక్కారని మండిపడ్డారు. ఇరిగేషన్ పేరుతో చెరువుల చుట్టూ ఉన్న భూములు కబ్జా చేసింద్రు అని ఆరోపించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సగం ప్రభుత్వ భూములు కబ్జా చేశారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

## ప్రజావాణితో సమస్యలు సత్వరమే పరిష్కారం

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్‌లో సోమవారం ఉన్నతాధికారులు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించరు ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్ సురేంద్రనాయక్, అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి

### శాసన మండలి సభ్యుడు కోదండరామ్





**ప్రజాపక్షం/నవాబుపేట్:** ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని శాసనమండలి సభ్యులు కోదండరాం అన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా నవాబ్‌పేట్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించే మహోత్సవ కార్యక్రమాన్ని అక్షర చేయూత ట్రస్ట్ మరియు ఎస్.జైపాల్ రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి సభ్యులు కోదండరామ్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, శాసనసభ్యులు కాలే యాదయ్య, అక్షర చేయూత ట్రస్ట్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి లు విచ్చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు పారితోషికంతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి మన ఊరి పాఠశాలను ఆదర్శవంతంగా ఉండేలా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించడమే కాకుండా మధ్యాహ్నం నాణ్యమైన భోజనాన్ని అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందించేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించేందుకు విద్యార్థులను ప్రోత్సహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ, విద్యార్థులు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేవారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకై ప్రభుత్వం ఎన్నో నిధులను ఇవ్వడం జరుగుతుందన్నారు. గత సంవత్సరం జిల్లాలో 100 పూర్వ ప్రాథమిక పాఠశాలలను నెలకొల్పామని, కెజిబివి, గురుకుల, ఆదర్శ పాఠశాలలతో పాటు వివిధ వసతి గృహాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా అల్పాహారాన్ని కూడా అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిగమించడానికి ఎంతో తోడ్పాటు అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. గతంలో కంటే ప్రస్తుతం మెరుగైన సౌకర్యాలైన ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్, డిజిటల్ ఎడ్యుకేషన్ అందుబాటులోకి వచ్చిందని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. తల్లిదండ్రులు పిల్లలను విద్య పట్ల మరింత ప్రోత్సాహాన్ని అందిస్తూ మంచి జీవితాన్ని అందించేందుకు తమ వంతు కృషి ఉండాలని సూచించారు. స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ, జిల్లాను ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గురుకుల, ఆదర్శ పాఠశాలలు నెలకొల్పడం వల్ల విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయని, గ్రామీణ ప్రాంతాల్లోని అందరూ పూర్తిస్థాయిలో విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. 2010వ సంవత్స రం నుండి ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు నగదు పారితోషకంతో పాటు జ్ఞాపికలను అందించి ప్రోత్సహించడం జరుగుతుందని ఆయన అన్నారు. గతంలో మూడు దఫాలుగా ఎమ్మెల్సీగా ఉన్న యాదవ రెడ్డి అధిక నిధులను వెచ్చించి రోడ్ల సౌకర్యం కల్పించడంలో కృషి చేశారని, ప్రస్తుతం రోడ్ల అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేయడం జరిగిందని త్వరలోనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ అనురాధ, ఎంఇఓ అబ్దుల్ రహేమాన్, సర్పంచులు నర్సింహారెడ్డి, బల్వంత్ రెడ్డి, ఎఎంసి చైర్మన్ రాథోడ్ గీతాసింగ్, నాయకులు మేడిపల్లి వెంకటయ్య, మధుసూదన్ రెడ్డి, రావు గారి వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాలు ఓటర్లకు అందించే ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీల సహకారం

### కలెక్టర్ మనుచౌదరి




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** బిఎల్ఒలు, బిఎల్ఎలు ఎన్యూమరేషన్ ఫారాలను ప్రతి ఒక్క ఇంటికి వెళ్లి ఓటర్లకు అందించే ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాకు చెందిన వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బిఎల్ఒలు, బిఎల్ఎలు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఓటరు జాబితాలో మ్యాపింగ్ కాని, ఓటర్లు 1987 కంటె ముందుగా జన్మించిన వారైతే తమ పదో తరగతి, ఇంటర్, కుల ధృవీకరణపత్రాలు, 1987–2004 మధ్య జన్మించిన వారైతే తమ తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరి గుర్తిం పు కార్డులు, 2004 తర్వాత జన్మించిన వారైతే తమ తల్లిదండ్రుల ఇద్దరి గుర్తింపు కార్డులు జతపరచాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే మ్యాపింగ్ పూర్తయిన ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలపై సంతకం చేస్తే సరిపోతుందన్నారు. రెండు ప్రాంతా ల్లో ఓటరుగా నమోదైన వారికి నోటీసులిచ్చి ఏదో ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసుకొనేలా చూడాలన్నారు. ప్రతి రోజు బిఎల్ఒలు, బిఎల్ఎలు కనీసం 30 ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వివరాలు పూర్తిచేసి తిరిగి ఇచ్చేందుకు వారం రోజుల గడువివ్వాలన్నారు.

## ప్రజావాణిలో 160 ఫిర్యాదులు స్వీకరణ

**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి కలెక్టర్ కార్యాలయంలో ప్రతిసోమవారం నిర్వహించే ప్రజావాణికి 160 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని జిల్లా కలెక్టర దీపక్‌తివారి తెలిపారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకోవాలని అదేశించారు. ఇందులో ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లు , తాగునీరు, ఫించన్లు, ఎలక్ట్రిసిటీ తదితరవాటిపై ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఉమాశంకర్‌ప్రసాద్, వెంకటచారీ, ట్రైనింగ్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్, జెడ్పి సిఇఒ సుధీర్, డిఆర్ఓ స్వర్ణలత, డిఆర్‌డిఓ శ్రీనివాస్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవ-**



**పోస్టర్ ఆవిష్కరణ:** జిల్లా కలెక్టర్ దీపక్ తీవారి మాదక ద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవ పురష్కరించుకొని పోస్టర్‌ను అవిష్కరించారు. థీమ్ నషాముక్త్ భారత్ అభియన్ వికసిత్ భారత్ కి పహచాన్ నిర్వహిస్తున్న కలెక్టర్ మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, మహిళా శిశు సంక్షేమ అధికారి పాల్గొన్నారు.

## రోడ్డును సొంత జాగీర్‌గా మార్చుకున్న మాజీ ప్రజాప్రతినిధి!

### ప్రశ్నించిన యువకుడిపై దాడి.. బోడుప్పల్‌లో కలకలం





**ప్రజాపక్షం/బోడుప్పల్ :** ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన మాజీ ప్రజాప్రతినిధి దౌర్జన్యానికి పాల్పడిన ఘటన బోడుప్పల్‌లో కలకలం రేపింది. రోడ్డుపై అడ్డంగా నిలిపిన బైక్‌లను తొలగించి దారి ఇవ్వాల ని కోరిన యువకుడిపై మాజీ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి దాడి చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. బాధితుడు కౌడె వంశీ (29) తెలిపిన వివరాల ప్రకారం శనివారంసాయంత్రం తన ఇంటికి కారులో వెళ్తుండగా ఆర్ఎన్ఎస్ కాలనీలోని మాజీ కార్పొరేటర్ నివాసం ఎదుట రోడ్డుపై బైక్‌లు అడ్డంగా నిలిపివుండటంతో వాటిని పక్కకు తీయాలని కోరాడు. అయితే దారి ఇవ్వాల్సిన చోట దౌర్జన్యానికి దిగిన మాజీ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి వంశీపై దాడి చేసినట్లు బాధితుడు ఆరోపించాడు. ఈ ఘటనలో గాయపడిన వంశీ పోలీసులను ఆశ్రయించగా ఫిర్యాదు ఆధారంగా కేసు నమో దు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా రోడ్డును ఆక్రమించడమే కాకుండా, దానిని ప్రశ్నించిన వ్యక్తిపై దాడి చేయడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధిగా పనిచేసిన వ్యక్తి నుంచే ఇటువంటి ప్రవర్తన రావడం పట్ల కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

## ఓటరు జాబితా సవరణపై బిఆర్ఎస్ కీలక వ్యూహచర్చ

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని సమర్థవంతగా ఎదుర్కొనేందుకు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని ఘట్‌కేసర్ ఉమ్మడి మండల ముఖ్య నాయకుల సమావేశంలో నిర్ణయించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు కావడంతో పాటు ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని నాయకులు సూచించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని ఓటరు జాబితా సవరణ ప్రకియలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. కొత్త ఓటర్ల నమోదు పేర్ల సవరణ చిరునామా మార్పులు తొలగింపుల అంశాల్లో ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. అలాగే గ్రామాలు, కాలనీలు, వార్డుల వారీగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేస్తూ అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి వారి వివరాలు నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

ఈ సమావేశంలో ఫీర్జాదిగూడ మాజీ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి మంద సంజీవరెడ్డి, మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉపాధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో చోరీ

**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** ఏకంగా ప్రభుత్వ పాఠశాలలో చొరబడిన దొంగలు విలువైన సామగ్రి ఎత్తుకెళ్లిన ఉదంతం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో గత శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి సిసి కెమెరాలు ధ్వంసం చేసి మరీ వైరింగ్, ప్లంబింగ్ సంబంధిత వస్తువుల ను చోరీ చేసారంటూ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు అజామొయినుద్దీన్ ఫిర్యాదు చేసాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొనిదర్యాప్తు చేస్తున్నారు.



## విత్తన మేళాను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** విత్తన మేళాను విజయవంతం చేయాలని శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల వ్యవసాయాధికారులు రమేష్, ప్రవీణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రెండు మండలాల్లో ని రైతు వేదికల్లో నిర్వహించే విత్తన మేళాను నేడు మంగళవారం నుంచి 30 జూన్ వరకు నిర్వహిస్తామని చెప్పారు. వారం రోజుల పాటు ప్రభుత్వం ఎంపిక చేసిన ఏడు రకాల విత్తనాలు బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటి సోనా, జైశ్రీరాం, కెఎన్ఎం 1638, డబ్ల్యూజిఎల్ 44, కెఎన్ఎం 7715 అలాగే నానో యూరియ, నానో డిఎపి కూడ విత్తన మేళాలో అందుబాటులో ఉంటుందని చెప్పారు. రైతులు ఇట్టి విత్తన మేళా లో పాల్గొని నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని అధిక దిగుబడి పొందాలని, విత్తన మేళాను విజయవంతం చేయాలని మండల వ్యవసాయాధికారులు రమేష్, ప్రవీణ ఆ ప్రకటనలో కోరారు.



## సొంతింటి కలను ఇందిరమ్మ ఇల్లు నిజం చేసింది : రజిత

**ప్రజాపక్షం/పరిగి:** నిరుపేదల సొంతింటి కల నిజం చేయడం పేదలకు ఇందిరమ్మ ఇల్లు వరం లాంటిదని పరిగి మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్‌తెలిపారు. పరిగిపట్టణంలోని 11వ వార్డులో కాలనీకి చెందిన లక్ష్మి నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇందిర్మ ఇళ్ల నిర్మాణం జోరుగా సాగుతుందని తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధాంతి పార్థసారథి పంతులు, పట్టణ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



## స్పీకర్‌ను కలిసిన మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు రఫియుద్దిన్, వెంకట్రామ్‌రెడ్డి

**ప్రజాపక్షం/మర్పల్లి:** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసిన సందర్భంగా స్పీకర్ శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడెం రాములు, మాజీ గ్రంథాలయ చైర్మన్ కొండల్‌రెడ్డి, మండల అధ్యక్షులు తుమ్మల సురేష్‌యాదవ్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు

### కాప్రా తహసీల్దార్ మతిన్

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** ప్రభుత్వ భూముల పరిరక్షణ లక్ష్యంగా ప్రత్యేక దృష్టి పెడుతున్నామని, భూ అక్రమణలకు పాల్పడితే ఆ నిర్మాణాలను కూల్చివేయటమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేయటం ద్వారా కఠిన చర్యలు తీసుకొంటామని కాప్రా తహసిల్దార్ మతిన్ హెచ్చరించారు. ప్రగతినగర్ ప్రాంత పరిసరాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు సోమవారం నేలమట్టం చేసారు. కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది జెసిబి వాహనాలతో జవహర్‌నగర్ ప్రాంతంలో వెలసిన అక్రమ కట్టడాలన్నిటిని పూర్తిగా కూల్చివేసారు. జవహర్‌నగర్ ప్రాంతంలో పూర్తిగా ప్రభుత్వ స్థలాలే ఉన్నాయని, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసే వారిని నమ్మి ఈ ప్రాంతంలో ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా అధికారులు మా బంధువులంటూ చెప్పి అక్రమ కట్టడాలు నిర్మించినా, ప్రభుత్వ భూములను ఆక్రమించినా వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు తాము కృషి చేస్తున్నామని, కబ్జాదారులపై పిడియాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.



## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### మేడ్చల్ జిల్లా ఆర్‌టిఐ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** విద్యార్థులకు నాణ్యమైన పోషక విలువలు కలిగిన భోజనాన్ని వడ్డించాలని మేడ్చల్ జిల్లా ఆర్‌టిఐ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం శామీర్‌పేట డివిజన్ తూంకుంటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం విద్యార్థుల ఆరోగ్యభివృద్ధికి, పాఠశాల హాజరు పెంపుకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం అందించడం, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, భోజన తయారీలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కత్తి రమేష్, తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకుడు ఎఆర్ సాదు యాదవ్ ఆగ్రహం

**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు, బిఆర్ఎస్ నాయకులు కెపి. వివేకానంద ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ.ఆర్ సాదు యాదవ్ తీవ్రంగా మండిపడ్డారు. ఆయన చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా, అభివృద్ధిని విస్మరించి రాజకీయ విమర్శలు చేయడం సరికాదని వారు హితవు పలికారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడమే లక్ష్యంగా బిఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపైన గాని, కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన గాని ఇలాంటి అవాకులు చవాకులు మాట్లాడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, యువజన నాయకులు పృథ్వి, శ్రీశైలం యాదవ్, గజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



## భారీ నకిలీ విత్తనాలు పట్టివేత

**ప్రజాపక్షం/పరిగి:** నకిలీ విత్తనాలపై నిఘా పెట్టి భారీ ఎత్తున నకిలీ విత్తనాలను పట్టుకోవడం జరిగిందని జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. విత్తనాల వేసే సిజన్ ఉండడంతో నకిలి విత్తనాలపై ప్రత్యేక నిఘాఏర్పాటు చేసినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు నేరుగా రైతులకు అమ్మేందుకు హనుమయ్య, నరసింహ, నరేందర్, మల్లేశం, మాల్యాద్రి ఐదుగురు కర్ణాటక రాష్టం నుంచి నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి నేరుగా రైతులకు అమ్మేందుకు తీసుకువచ్చి నిల్వ ఉంచినట్లు నమ్మదగిన సమాచారంతో అదుపులోకి తీసుకోని నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. సుమారు 35లక్షలవిలువ చేసే 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు ఎస్‌పి తెలిపారు. కర్ణాటక రాష్టంలో జిన్నింగ్ చేయించి నకిలీ విత్తనాలు తయారు చేశారు. నకిలీ పత్తి విత్తనాలను పరిగి తుంకుల్ గడ్డ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డబుల్ బెడ్ రూమ్‌లో దాచి కొంతగా తీసుకొని కిలోకు రూ.500ఖర్చు కాగాఅమాయక రైతులకు కిలో 1500నుండి 2000రూపాయల వరకు అమ్ముతున్నట్లు తెలిసి పోలీసులు పట్టుకున్నారు.భారీ నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నందుకు పోలీసులకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పిఅంజయ్య, పరిగి సిఐ కొండల్‌రెడ్డి, టాస్క్ ఫోర్స్ సిఐ అన్వర్ పాషా, ఎస్ఐ మోహన్‌కృష్ణ, టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు పాల్గొన్నారు.

## వివాహ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి ఉదారతను చాటుకున్నారు. మూడుచింతలపల్లికి చెందిన మాధవి, రవి దంపతుల కుమార్తె వివాహానికి ఖర్చుల నిమిత్తం మున్సిపల్ చైర్మన్ జాం రవి రూ. 15 వేలు అలాగే 6 వ వార్డు కౌన్సిలర్ నీరజ్‌గౌడ్ రూ. 11 వేలు వివాహ ఖర్చులకు ఆర్థిక సహయం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు తమవంతు సహాయం అందించడం జరుగుతుందన్నారు.

## బోనాలకు అన్ని విధాలుగా సహకరిస్తాం



దేవాదాయశాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు

**ప్రజాపక్షం/చార్మినార్:** ఆషాఢమాసంలో అత్యంత వైభవంగా నిర్వహించే బోనాల ఉత్సవాలకు ఎండోమెంట్ శాఖ తరపున అన్ని విధాలుగా సహకారం అందిస్తామని దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రానున్న బోనాల పండుగను పురస్కరించుకొని వివిధ శాఖల అధికారులు, వివిధ ఆలయాల కమిటీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా హరిబౌలిలోని అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం కమిటి కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌పి.క్రాంతి కుమార్, కార్యవర్గ సభ్యులు ఆర్.అశోక్‌రెడ్డితో కలసి దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావుకి వినతిపత్రం అందచేశారు.

## కలుషిత నీటి సమస్య పరిష్కరించాలి



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** కలుషితనీటి సమస్యను పరిష్కరించాలని వెంగళరావునగర్ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు కాలనీలోని డిటైప్ హౌసెస్ ప్రాంతాలతో పాటు జనతా మోడల్ హౌసెస్ పరిసరాల్లో తాగునీటి పైపులైన్లలో మురుగునీరు కలుస్తుండటంతో స్థానిక ప్రజలు సీనియర్ కాంగ్రెస్ నేత దేవిరెడ్డి నాగార్జునరెడ్డికి తెలిపారు. దీంతో స్పందించిన ఆయన వాటర్ వర్క్స్ కాంట్రాక్టర్‌తో పాటు డీజీఎం రవీందర్‌ను సోమవారం కలిసి పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో వెంగళరావునగర్ కాలనీ అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పూదోట శౌరిరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం

**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చార్మినార్ జెడ్‌సి కన్నం సత్యనారాయణ సూచించారు. చాంద్రాయణగుట్ట జోనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని సంబంధిత విభాగాలకు చెందిన అధికారులను ఆదేశించారు. జోనల్ జాయింట్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, జోనల్ ఏఎంసి రాజారావు, సీనియర్ అసిస్టెంట్ హమీద్, సిబ్బంది పాల్గొన్నారు.

## పింఛన్ అథెంటిఫికేషన్ గడువు పొడిగింపు: తహసీల్దార్ అన్వర్

**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** చేయూత పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు తమ అథెంటిఫికేషన్‌ను వెంటనే చేసుకోవాలని అంబర్‌పేట్ తహశీల్దార్ మహమ్మద్ అన్వర్ హుస్సేన్ సూచించారు. గడువును ఈనెల 27వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. మండల పరిధిలో మొత్తం 19 వేల మంది పింఛనుదారులు ఉండగా, ఇప్పటివరకు 12,000 మంది పింఛన్ దారులు ఇంకా లైవ్ అథెంటిఫికేషన్ చేసుకోవాల్సి ఉందన్నారు. వారంతా త్వరగా మండల కార్యాలయానికి వచ్చి లైవ్ అథెంటిఫికేషన్ చేసుకోవాలన్నారు.

## ప్రధాన రహదారిలో ట్రాఫిక్ జామ్




**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** ఫుట్‌పాత్ ఆక్రమణలతో ట్రాఫిక్‌జామ్‌లు నెలకొంటున్నా.. ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. ప్రధాన రహదారులతో పాటు గల్లీల్లో సైతం నడిచి వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ క్రమంలోనే కోఠి, బ్యాంక్‌స్ట్రీట్, ట్రూప్‌బజార్, హనుమాన్‌టెకిడీ, రాంకోఠి, కింగ్‌కోఠి, ఇసామియాబజార్, మెటర్నటీ ఆసుపత్రి... ఇలా కోఠి పరిసర ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలతో ట్రాఫిక్‌జామ్ నెలకొంటోంది. ముఖ్యంగా ప్రధాన రహదారిలో గోకుల్‌చాట్‌తో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. అంతేకాకుండా హనుమాన్‌టెకిడీలోని ఓ టిఫిన్ సెంటర్ కారణంగా ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఇక ట్రూప్‌బజార్‌లో సైతం వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇకనైనా సుల్తాన్‌బజార్, అబిడ్స్ ట్రాఫిక్ పోలీసులు స్పందించి జామ్ సమస్యకు చెక్‌పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## జూబ్లీహిల్స్ పిఎస్ ముందు ఆందోళన



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** చంపుతానంటూ బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలంటూ ఎంఆర్‌పిఎస్ జూబ్లీహిల్స్ పీఎస్ ముందు ఆందోళన చేపట్టింది. బాదితుల కథనం ప్రకారం.. శ్రీధర్‌రావు అనే వ్యక్తి జూబ్లీహిల్స్ రోడ్ నెం9లో అరంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. దీనిలో ఏసీలు బిగించేందుకు వచ్చిన టెక్నీషియన్లు, కంపెనీ ప్రతినిధులను చిన్న విషయంపై గదిలో బంధించి చితకబాదడంతో పాటు కులం పేరుతో దూషిస్తూ గన్‌తో కాల్చేసి తన బిల్డింగ్‌కు బలి ఇస్తా అంటూ అరాచకం సృష్టించారు. ఈ మేరకు బాధితులు పది రోజుల క్రితమే జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ కేసు నమోదు చేయలేదు. దీంతో సోమవారం ఎంఆర్‌పీఎస్ నేతలు, కార్యకర్తలు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. నలుగురు ముఖ్యమంత్రుల మద్దతు తనకు ఉందంటూ శ్రీధర్ రావు విర్రవీగుతున్నారని.. గన్ లైసెన్స్ వెంటనే క్యాన్సల్ చేసి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎంఆర్‌పిఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఘటనపై సిపి సజ్జనార్ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

### గుడుంబా గుట్టు రట్టు.. ప్రత్యేక దాడులతో

# ఎక్సైజ్ శాఖకు భారీ విజయాలు

**841 కేసులు నమోదు.. 651 మంది అరెస్టు.. 119 వాహనాలు సీజ్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో నాటు సారా (గుడుంబా), నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డిపిఎల్), గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ చేపట్టిన తొలి ప్రత్యేక డ్రైవ్ ఆశాజనక ఫలితాలను ఇచ్చింది. ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన దాడుల్లో మొత్తం 841 కేసులు నమోదు చేసి, 651 మందిని అరెస్టు చేశారు. 119 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అవినాశ్ మహంతి ఆదేశాల మేరకు, ఎస్‌టిఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, డిటిఎఫ్ బృందాలు, ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టాయి. గుడుంబా నిర్మూలనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎక్సైజ్ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, కమిషనర్ సి. హరికిరణ్ పలు సమావేశాల్లో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**గుడుంబాపై భారీ దాడులు..**

ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 3,191 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోగా, 64,435 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 8,377 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా కేసుల్లో వరంగల్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు పరిధి అగ్రస్థానంలో నిలిచింది. అక్కడ 260 కేసులు నమోదు చేసి, 206 మందిని అరెస్టు చేశారు. 1,400 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. రెండో స్థానంలో కరీంనగర్ డిసి డేవిడ్ రవికాంత్ పరిధిలో 108 కేసులు నమోదు చేసి, 76 మందిని అరెస్టు చేయగా, 310 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ డిసి శ్రీనివాసరెడ్డి పరిధిలో 86 కేసులు నమోదు చేసి, 58 మందిని అరెస్టు చేయగా, 260 లీటర్ల నాటుసారాను పట్టుకున్నారు. అదిలాబాద్ డీసీ రఘురాం పరిధిలో 80 కేసులు నమోదు చేసి, 76 మందిని అరెస్టు చేసి, 298 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.

**ఎన్‌డిపిఎల్ మద్యం పట్టివేత**

ప్రత్యేక డ్రైవ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 362.72 లీటర్ల నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్ పరిధిలో అత్యధికంగా 206.56 లీటర్లు పట్టుబడ్డాయి. హైదరాబాద్ డీసీ అనిల్ కుమార్ రెడ్డి పరిధిలో 66 లీటర్లు, మెదక్ డిసి హరికిషన్ పరిధిలో 49.32 లీటర్ల మద్యం స్వాధీనం చేశారు. ప్రత్యేక డ్రైవ్ సందర్భంగా 114.32 కిలోల గంజాయి, 41 గ్రాముల ఎండీఎంఏ, 310 గ్రాముల కోకైన్, 6.3 గ్రాముల హెరాయిన్‌ను ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా, అక్రమ మద్యం, మాదకద్రవ్యాల నిర్మూలనపై మరింత కఠిన చర్యలు కొనసాగుతాయని ఎక్సైజ్ శాఖ అధికారులు స్పష్టం చేశారు.



### ప్రజావాణిలో 1395 దరఖాస్తులు

## సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ ప్రియాంక ఆల




**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** జిల్లా కలక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 1395 దరఖాస్తులు వచ్చాయని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. వివిధ సమస్యల పరిష్కా రం కోరుతూ వచ్చిన ఈ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారుల ను ఆమె ఆదేశించారు. ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు. సిఎం ప్రజావాణి, శాఖల వారీగా ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై ఆమె సమీక్ష నిర్వహించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం వచ్చిన దరఖాస్తుల్లో గృహనిర్మాణ శాఖకు చెందినవి 1171, ఫింఛన్లకు సంబంధించిన 179, రెవెన్యూ శాఖకు చెందినవి 16, ఇతర శాఖలవి 29 దరఖాస్తులు వచ్చా యి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదివరన్ పలని, జితేందర్ రెడ్డి, డిఆర్ఒ నారాయణ, హౌసింగ్ పిడి అశోక్ చక్రవరి అధికారులు పాల్గొన్నారు.

## ఆలయాలకు మరమ్మతులు చేపట్టాలి



**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** బోనాల పండుగ సందర్భంగా ఆలయాలకు మరమ్మత్తులు చేపట్టాలని రవీందర్‌నాయక్‌నగర్ కాలనీ బంజారాహిల్స్ కమిటీ అధ్యక్షుడు ఎ.కృష్ణనాయక్ కోరారు. ఈ మేరకు ఆలయాలకు తక్షణమే మరమ్మత్తు పనులు చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ జంగంమెట్ డిసి సురేందర్‌కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

## మానవత్వాన్ని చాటుకున్న ట్రాఫిక్ పోలీసులు



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** తమతో పాటు పనిచేస్తున్న హోంగార్డు కూతురి వైద్య ఖర్చులకోసం కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాచిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న కే.నాగయ్య కుమార్తె అర్పుద(6)కు హఠాత్తుగా షుగర్ లెవెల్స్ పెరిగిపోయి తీవ్ర అస్వస్థతకు గురైంది. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి అర్పుద పరిస్థితి గురించి ఆందోళన చెందుతున్న హోంగార్డు నాగయ్యకు కాచిగూడ ట్రాఫిక్ సిబ్బంది ధైర్యం చెప్పి తాము అండగా ఉన్నామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు ట్రాఫిక్ సిఐ వీరకౌశిక్ ఆధ్వర్యంలో అప్పటికప్పుడు అంతా కలసి రూ.40 వేలు జమ చేసి తమ వంతు సహాయంగా అందజేశారు. కార్యక్రమంలో కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఎస్ఐలు వీరమల్లు, జ్ఞానేశ్వర్, శ్రీకాంత్, కేటీ నాయక్, రాకేష్, ఏఎస్ఐలు రాజశేఖర్‌రెడ్డి, ఠాగూర్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, భాస్కర్, కానిస్టేబుల్ శ్రీనివాస్, హోంగార్డ్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ హార్వెస్టింగ్‌తో పరిష్కారం



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** నీటి కొరతను ఎదుర్కొంటున్న పట్టణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ ఎంత ప్రభావితమైన పరిష్కారం చూపిస్తుందో ఓ అపార్ట్‌మెంట్ వాసులు నిరూపించారు. ఈ మేరకు మాదాపూర్‌లోని బేవర్లీ హిల్స్ ప్రాంతంలో ఉన్న బేవర్లీ స్ప్రింగ్స్ అపార్ట్‌మెంట్‌వాసులు గత వేసవిలో రోజువారీ నీటి అవసరాల కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సి రావడంతో దాదాపు రూ.1 లక్ష వరకు వ్యయం చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో జలమండలి సాంకేతిక సాయంతో అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్‌తో పాటు ఇంజెక్షన్ బోర్‌వెల్‌ను ఏర్పాటు చేశారు. అలాగే భవనం పైకప్పుల నుంచి వచ్చే వర్షపు నీటిని కేంద్రీకృత హార్వెస్టింగ్ వ్యవస్థకు అనుసంధానం చేసి, భూగర్భ జలాల పునరుద్ధరణకు సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జలమండలి ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి సత్యనారాయణకు అపార్ట్మెంట్ అసోసియేషన్ ప్రతినిధి గడ్డం ప్రకాష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# ఫారెవర్ లివింగ్ పేరుతో భారీ మోసం

- 26 మందిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫారెవర్ లివింగ్ ఉత్పత్తులు, వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో యువతను ఆకర్షించి భారీగా డబ్బులు వసూలు చేసిన మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్‌ఎం) నెట్‌వర్క్‌పై హైదరాబాద్ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. రైన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును సిసిఎస్ ఆర్థిక నేరాల విభాగం టీమ్5కు బదిలీ చేశారు. యాఖుత్‌పురకు చెందిన 19 ఏళ్ల విద్యార్థిని ఫాతిమా బేగం ఇన్‌స్టాగ్రామ్‌లో కామెడీ రీల్స్ చూస్తుండగా నౌమాన్ రజా అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతని ద్వారా షోయెబ్ ఇర్ఫాన్ పరిచయం కాగా, కర్మన్‌ఘాట్‌లోని 'అచీవర్స్ క్లబ్' కార్యాలయానికి పిలిపించి ఆరోగ్య ఉత్పత్తులు, బిజినెస్ ప్లాన్ గురించి వివరించారు. 'స్లో, మీడియం, ఫాస్ట్' ట్రాక్‌ల పేరుతో ఎక్కువ ఆదాయం వస్తుందని నమ్మించి 2025 ఆగస్టు 31న రూ.30 వేల నగదు తీసుకున్నారు. అనంతరం మేనేజర్ స్థాయి పేరుతో మరో రూ.60 వేలు వసూలు చేసినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఆన్‌లైన్ జూమ్ శిక్షణ ఇచ్చి కొత్త సభ్యులను చేర్చాలని సూచించిన నిందితులు, లీడ్స్ కూడా అందజేసినట్లు విచారణలో తేలింది. బాధితురాలు ద్వారా మరో ఐదుగురు సభ్యులు చేరగా, వారిలో ఒక్కొక్కరి నుంచి రూ.30 వేల చొప్పున మొత్తం రూ.1.50 లక్షలు సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం నిందితులు ఫోన్లు ఎత్తకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

**26 మందిపై కేసు..**
**పరారీలో కంపెనీ డైరెక్టర్లు**

దర్యాప్తులో భాగంగా ఇప్పటికే పలువురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు, మూడు కంపెనీలు, వాటి డైరెక్టర్ల పాత్రపై ఆధారాలు లభించడంతో మొత్తం 26 మందిని నిందితులుగా చేర్చారు. నిందితుల జాబితాలో మొహమ్మద్ అక్రమ్, నౌమాన్ రజా, రహీమ్ అస్లాం, షోయెబ్ ఇర్ఫాన్, హరీష్ కుమార్ సింగ్లా తదితరులతో పాటు ఫారెవర్ లింవింగ్ ఎంపోర్ట్స్ కంపనీ, ఫారెవర్ లీవింగ్ ప్రొడక్ట్స్, అచీవర్స్ క్లబ్ ఫండేషన్‌లతో పాటు వాటి డైరెక్టర్ల పేర్ల పేర్లపై కూడా కేసు నమోదు అయ్యింది.రైన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు ఫైల్‌ను అదనపు పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సిసిఎస్ డిడికి బదిలీ చేయగా, ఇన్‌స్పెక్టర్ ఈ. జహంగీర్ యాదవ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రామకథ నృత్య రూపకం



**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ:** తెలుగు వాగ్గేయకారుల కీర్తనలకు.. భక్తి నేపథ్యంగా నాట్య తరంగిణి నటరాజ నాట్య సమితి బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య రూపం ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై సుమారు నూటాయాభై మంది యువ కళాకారులు రామకథను నృత్య రూపకంగా ప్రదర్శించి ప్రేక్షకుల్ని ముగ్ధులను చేశారు. కార్యక్రమంలో రామదాసు తేజావత్, వాణి, మురళీమోహన్, సత్యనారాయణ, సంతోష్, నాట్య గురువు తరంగిణి తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలపై అవగాహన



**ప్రజాపక్షం/యూసుఫ్‌గూడ:** మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని మధురానగర్‌లోని మెరిటో జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో మధురానగర్ సిఐ హెచ్.ప్రభాకర్, సిఎఆర్2 సిబ్బంది, సైబర్ వారియర్స్ పాల్గొని మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, డ్రగ్స్‌కు సంబంధించిన నేరాలు, చట్టపరమైన శిక్షలు, సైబర్ మాధ్యమాల ద్వారా జరుగుతున్న అక్రమ కార్యకలాపాల ప్రమాదాలు గురించి వివరించారు.

## గిరిజనుల సంక్షేమానికి కృషి

**ప్రజాపక్షం/గోషామహల్:** గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తూ బిజెపిని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి మునావత్ పాండు నాయక్ పేర్కొన్నారు. బిజెపి రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శిగా ఇటీవల నియమితులైన పాండు నాయక్ మాట్లాడుతూ, గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో గిరిజన తండాల సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## కాంగ్రెస్ బిఎల్ఎలకు ఎస్ఐఆర్ శిక్షణ



**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో వెంగళరావునగర్ డివిజన్ సిద్ధార్థనగర్ కమ్యూనిటీ హాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు, బీఎల్ఏల కోసం ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రేమ్‌కుమార్, డీసీలు సురేష్, ఉమా, ఏఎంసీ బాలరాజుతో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, రహమత్ నగర్ మాజీ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిఆర్ పేరుతో రూ.2.70 కోట్ల మోసం..

ఆర్కిటెక్ట్‌పై కేసు నమోదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ శ్రీకారా హాస్పిటల్స్‌కు చెందిన మేసర్స్ వెంకటేశ్వర ఆర్థో హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌ను టిడిఆర్ అనుమతుల పేరుతో రూ.2.70 కోట్లకు పైగా మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు సిసిఎస్ పోలీసు విభాగం ఇఒడబ్ల్యూ టీమ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది.పోలీసుల వివరాల ప్రకారం, శ్రీకారా హాస్పిటల్స్ జనరల్ మేనేజర్ వల్లకాటి శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్కిటెక్ట్ శివశంకర్ పాటలాయ 202021లో భవన నిర్మాణ అనుమతులు, టిడిఆర్ ప్రక్రియలను పూర్తి చేస్తానని హామీ ఇచ్చాడు. బాచుపల్లి, నల్లగండ్ల, మియాపూర్ ప్రాంతాల్లో అదనపు అంతస్తుల నిర్మాణాలకు అవసరమైన టిడిఆర్ అనుమతులు తీసుకొస్తానని చెప్పి, తన సూచన మేరకు వివిధ ఖాతాల్లో మొత్తం రూ.2,70,64,832 చెల్లింపులు చేయించుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే బాచుపల్లి ప్రాజెక్టుకు సంబంధించి రూ.1.32 కోట్లు, నల్లగండ్ల ప్రాజెక్టుకు రూ.65.18 లక్షలు, మియాపూర్ ప్రాజెక్టుకు రూ.72.47 లక్షలు చెల్లించినప్పటికీ టీడీఆర్ అనుమతుల కోసం దరఖాస్తులు కూడా చేయలేదని ఆరోపించారు. పలుమార్లు అడిగినా పనుల పురోగతిపై వివరాలు ఇవ్వకుండా కాలయాపన చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను తీసుకున్న డబ్బుకు బాధ్యత వహిస్తూ శివశంకర్ పాటలాయ లిఖితపూర్వకంగా అంగీకరించడమే కాకుండా, రూ.2.70 కోట్లకు ఇండస్ ఇండ బ్యాంక్ చెక్కు జారీ చేసినట్లు తెలిపారు. అయితే ఆ చెక్కు 2026 మార్చి 25న 'ఫండ్స్ ఇన్‌సఫిషియంట్' కారణంగా బౌన్స్ అయినట్లు వెల్లడించారు. అనంతరం తన తప్పును అంగీకరించి సికింద్రాబాద్‌లోని 71.64 చదరపు గజాల స్థలాన్ని తనఖాగా పెట్టి అభివృద్ధి ఒప్పందంకమ్‌జీపీఏ అసలు పత్రాలను అప్పగించినప్పటికీ బకాయిలు చెల్లించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనతో శ్రీకారా హాస్పిటల్స్ ఎండి డాక్టర్ అఖిల్ దాది తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని ఫిర్యాదుదారు తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా సిసిఎస్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ కేసు దరార్యప్తు చేస్తున్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సంఘాల సమాఖ్య



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** ఎస్‌సి, ఎస్‌టి, బిసి,మైనారిటీ సంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కెతావత్ రామకృష్ణను నియమిస్తున్నట్లు ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు ఉదిత్ రాజ్ ప్రకటించారు. జమ్మూకాశ్మీర్ రాష్ట్ర రాజధాని శ్రీనగర్‌లో మూడు రోజుల పాటు జాతీయ అధ్యక్షుడు ఉదిత్ రాజ్ అధ్యక్షతన సంఘాల సమాఖ్య జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో రామకృష్ణకు 21 రాష్ట్రాల అధ్యక్షులు, ప్రతినిధుల సమక్షంలో ఇందుకు సంబంధించిన నియామక పత్రం అందించారు. తెలంగాణ రాష్ట్రంలో భారత రాజ్యాంగ వ్యాప్తి,ఎస్‌సి, ఎస్‌టి, బిసి,మైనారిటీ ప్రజల అభ్యున్నతికి రామకృష్ణ కృషి చేస్తారని ఆకాంక్షిస్తున్నట్లు ఉదిత్ రాజ్ తెలిపారు. ప్రస్తుతం రామకృష్ణ హైదరాబాద్ డివిజన్ ఆర్డీఓగా, డిప్యూటీ కలెక్టర్ల సంఘం జనరల్ సెక్రటరీగా, తెలంగాణ ప్రభుత్వ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతూనే గత కొన్ని సంవత్సరాలుగా భారత రాజ్యాంగ వ్యాప్తి కోసం కృషి చేస్తున్నారు.

## మజ్లీస్‌తోనే అభివృద్ధి సాధ్యం



**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** మౌలిక సదుపాయాల కల్పన.. అభివృద్ధి.. ప్రజా సంక్షేమం దిశగా పనిచేస్తున్నామని చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ తెలిపారు. ఈ మేరకు ఉప్పుగూడ డివిజన్‌లో రూ.100 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప్పుకూడా మాజీ కార్పొరేటర్ అబ్దాత్, మాజీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ సమద్ బిన్ అబ్దాత్, వరకాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 'ధన్వంతరి' బాధితులకు న్యాయం జరిగినట్టే

నిందితుల స్టే పిటిషన్ హైకోర్టు కొట్టివేయడం హర్షణీయం

విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్టు అధినేత గిరిప్రసాద్ శర్మ

**ప్రజాపక్షం /హిమాయత్‌నగర్:** ధన్వంతరి ఫౌండేషన్ ఆస్తులు జప్తు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన జిఒను నాంపల్లి ఎంఎస్‌జె కోర్టు సమర్థించడాన్ని సవాల్ చేస్తూ నిందితులు వేసిన స్టే పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిందని విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్టు అధినేత గిరిప్రసాద్ శర్మ తెలిపారు. విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్టు ఇంప్లీడ్ అయి గట్టిగా కౌంటర్‌లు ఇవ్వడం ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. ఈ కేసులో డిఎఫ్ఐ ట్రస్టు , కంపెనీలు, డిబెంచర్ల వాదనలను హైకోర్టు తోపిపుచ్చిందన్నారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఆయన మాట్లాడారు. అనేక కంపెనీలు పేరిట అక్రమంగా సంపాదించాలని ధన్వంతరి ఫౌండేషన్ నిర్వాహకులు అనేకమంది వద్ద వందలాది కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టించుకొని మోసం చేశారన్నారు.

# ప్రతీ ఏటా 15 లక్షల క్యాన్సర్ కేసులు

## కేంద్ర మంత్రి అనుప్రియ పటేల్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత ఏడాదిలో కొత్తగా 15 లక్షల క్యాన్సర్ కేసులు నమోదయ్యాయని కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్ ఆందోళన వ్యక్తం చేశారు. 'ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రజతోత్సవ' కార్యక్రమం హైదరాబాద్‌లో సోమవారం జరిగింది. ఈ రజతోత్సవ వేడుకలకు కేంద్ర సహాయక మంత్రులు అనుప్రియ పటేల్, పెన్నమసాని చంద్రశేఖర్, ఎపి సిఎం చంద్రబాబునాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు, తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎపి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, 'ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ట్రస్ట్ చైర్మన్ నందమూరి బాలకృష్ణ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అనుప్రియ పటేల్ మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధి ఒక సవాలుగా మారిందన్నారు. పర్యావరణ, ఆహార, జీవన శైలిలో వచ్చిన అలవాట్లు, మార్పుల కారణంగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయన్నారు. క్యాన్సర్ నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, దేశవ్యాప్తంగా క్యాన్సర్‌ను గుర్తించేందుకు తగిన పరికరాలు అందుబాటులో ఉన్నాయని, దేశ వ్యాప్తంగా 820 వైద్య కళాశాలలు ఉన్నాయని ఆమె వివరించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు బసవరతారక ఆస్పత్రి ఏర్పడిందన్నారు. ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్సను అందిస్తున్నారన్నారు.

**ఉచితాలు కాదు.. విద్య, వైద్యం ఉచితంగా ఇవ్వండి..: ఎం.వెంకయ్యనాయుడు**

ప్రజలకు ఉచితాలు వద్దని, వాటి స్థానంలో విద్య, వైద్యం ఉచితంగా అందిస్తే, సామన్యులకు ఉపయోగమని, దీనిపైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు సూచించారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అందరికీ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలన్నారు. క్యాన్సర్ చికిత్సకు బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి మరింత చేరువకావాలన్నారు. జీవనశైలి మార్పు కారణంగా రాచపుండు(క్యాన్సర్) వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

**బవసతారకం లాభాపేక్షలేని వైద్య సంస్థ**
**ఆంధ్రప్రదేశ్ సిఎం నారా చంద్రబాబునాయుడు**

రాబోయే 25 సంవత్సరాల్లో భారతదేశంలోనే 'బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి' ఒక లాభాపేక్షలేని సంస్థగా (నాన్ ప్రాఫిట్) నిలుస్తూ, పేదలకు వెలుగు చూపిస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. క్యాన్సర్ లాంటి పలు వ్యాదుల పెరుగుతున్న నేపథ్యంలో దేశంలో బవసతారకం లాంటి లాభాపేక్షలేని వైద్య సంస్థలు మరింత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమైఖ్య ఆంధ్రప్రదేశ్‌లో, ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు బసవరతారకం ఆస్పత్రికి సహకరిస్తున్నందుకు అభినంధించారు. ప్రతి విజయానికి ఒక స్టోరీ ఉంటుందని, ఎన్‌టిఆర్ సినిమాల్లో నిమగ్నమైతే, 'మా అత్తమ్మ' బసవతారకం ఆ కుటుంబానికి పెద్ద దిక్కుగానిలిచిందని, అంత పెద్ద కుటుంబాన్ని ఎంతో విలువలతో క్రమశిక్షణతో పెంచిందని, అనుబంధాలు, ఆప్యాయాతలను పంచిదని బాబు గుర్తు చేశారు. బసవతారకం గొప్ప మానవతావాది అని అన్నారు. అత్తమ్మను (బసవతారకం)శాశ్వతంగా గుర్తు పెట్టుకోవాలని, ఎన్‌టిఆర్ ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తీవ్రంగా ప్రయత్నించామన్నారు. తండ్రి ఒక్క మొక్కను నాటితే, కొడుకు బాలకృష్ణ కల్పవృక్షంగా మార్చారని అభినంధించారు. బసవతారకం ఆస్పత్రిని క్యాన్సర్ బాధితులకు ఒక దేవాలయంగా మార్చారన్నారు. బసవతారకం ఆస్పత్రి వేలాది కుటుంబాలకు ధైర్యాన్ని, ఒక వెలుగునిచ్చిందన్నారు. ఈ ఆస్పత్రిలో ప్రతి ఏటా 3 లక్షలకు అవుట్ పేషంట్లకు చికిత్సను అందిస్తున్నారని, ప్రతి రోజూ 22 మందిది, ఏడాదికి 8 వేల ఆపరేషన్లు చేస్తున్నారని వివరించారు. క్యాన్సర్ రోగిని ఒక కుటుంబంగా చూస్తున్నారన్నారు. ఎపిలోని అమరావతిలో వెయ్యి పడకల ఆస్పత్రి నిర్మిచేందుకు ముందుకొచ్చిన బసవతారకం ట్రస్ట్‌ను అభినంధించారు. 2024లో 15లక్షల మంది క్యాన్సర్ కేసులు నమోదయ్యాయని, ప్రతి ఏటా 9 లక్షల మంది చనిపోతున్నారని బాబు ఆందోళన వ్యక్తం చేశారు. క్యాన్సర్ బారినపడితే ఆ కుటుంబం కుప్పకూలుతుందని, మానసిక, ఆర్థికంగా చితికి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రెస్ట్ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే నివారించేందుకు అవకాశాలు ఉంటాయన్నారు.

**క్యాన్సర్ నియంత్రణకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలి: మంత్రి దామోదర రాజనర్సింహ**

తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ క్యాన్సర్ నియంత్రణ కోసం ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, వైద్య నిపుణులు అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. 25 ఏళ్లుగా క్యాన్సర్ బాధితులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న బసవతారకం హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది, దాతలను ఆయన అభినందించారు. తెలంగాణలోని ప్రతి జిల్లాలో డేకేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేసి, స్థానికంగానే కీమో థెరపీ సేవలు అందిస్తున్నామని వివరించారు. ఎంఎన్‌జె, నిమ్స్ హాస్పిటల్‌ను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు.

ఎపి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి తగిన చిక్సిత చేపడుతున్నామని వివరించారు. క్యాన్సర్ పట్ల ప్రజలలో అవగాహన కల్పిస్తున్నామని, క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపైన కూడా విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని వివరించారు. నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి రోగి గెలిచే వరకు బసవతారకం సేవలు కొనసాగుతాయన్నారు.

# క్యూబా విప్లవ యోధుడు రామిరో వాల్డెస్ మెనెండెజ్ కన్నుమూత

## డియాజ్ కానెల్ సంతాపం



**హవానా:** క్యూబా విప్లవంలో కీలక పాత్ర పోషించిన విప్లవ యోధుడు, ఆ దేశ పూర్వ ఉపాధ్యక్షుడు రామిరో వాల్డెస్ మెనెండెజ్ తన 94వ ఏట కన్నుమూశారు. క్యూబా విప్లవ నాయకుడు, ప్రగతిశీల ప్రపంచానికి స్ఫూర్తిదాయక నాయకుడు ఫైడల్ కాస్ట్రో సమకాలికుడు మెనెండెజ్ ఆదివారం మరణించారని క్యూబా కమ్యూనిస్టుపార్టీ, క్యూబా ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపాయి. 1953లో క్యూబా విప్లవానికి నాంది పలికిన మోంకాడా సైనిక శిబిరంపై దాడి ఘటన దగ్గర నుండి ఫైడల్ కాస్ట్రో, ఆయన సోదరుడు రౌల్ కాస్ట్రోలకు అత్యంత సన్నిహితంగా మెలగుతూ విప్లవోద్యమంలో, ఆ తర్వా త ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూ తర్వాత దశాబ్దాలలో కూడా ప్రభావవంతమైన నాయకుడుగా కొనసాగారు మెనెండెజ్. ''విప్లవ ఆశయాలపట్ల ఆయన ఎంతో ఆంకితభావంతో మెలిగారు, క్యూబా జన్మభూమిపట్ల, విప్లవానంతర లక్ష్యాలపట్ల ఆయన విధేయత నిరూపించుకుని దేశ ప్రజల గౌరవ, అభిమానాలకు పాత్రులయ్యారు అని అధికార వార్తాసంస్థ క్యూబా డిబేట్ ప్రకటించింది. క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం తెలియజేశారు. తన తండ్రిని కోల్పోయినంత ఆవేదన, బాధ కలుగుతోందని పేర్కొన్నారు. కమాండర్ రామిరో జీవితం యావత్తూ కాస్ట్రో, ఆయన సోదరుడు రౌల్ పట్ల కనబరిచిన విధేయతతోనే నిండి ఉందని పేర్కొన్నారు. 1938 ఏప్రిల్ 28న పశ్చిమ నగరం ఆర్టెమిసా నగరంలో కమాండర్ రామిరో జన్మించారు. నిరంకుశ పాలకుడు ఫుల్జెన్సియా బాటిస్టా ప్రభుత్వాన్ని కూలదోసి విప్లవానికి నాంది పలికిన మోంకాడా సైనిక శిబిరంపై ఫైడెల్ కాస్ట్రో దాడి చేశారు. ఈ దాడిలో రామిరో వాల్డెజ్ మెండెజ్ పాల్గొన్నారు. ఆనాడు ఆయన వయసు 21 సంవత్సరాలు. 'జూలై 26' ఉద్యమ వ్యవస్థాపకులలో ఒకరు. 1965 అక్టోబరు నుండి ఆయన క్యూబా కమ్యూనిస్టుపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడుగా ఉన్నారు. హోం మంత్రి, ఉప ప్రధాన మంత్రి సహా అనేక కీలక పదవులు నిర్వహించారు. 2006 ఆగస్టులో సమాచార, కమ్యూనికేషన్స్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.1960లో రౌల్ కాస్ట్రోతో కలిసి చెకొస్లొవేకియాలో పర్యటించారు.

# ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలి




## తెలంగాణ అగ్రి గోల్డ్ బాధితుల డిమాండ్

**ప్రజాపక్షం/ముషీరాబాద్:** అగ్రిగోల్డ్ బాదితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని.. అగ్రి గోల్డ్ బాదితుల కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి న్యాయం చేయాలని తెలంగాణ అగ్రిగోల్డ్ బాదితుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం తెలంగాణ అగ్రి గోల్డ్ బాదితుల సంఘం ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకురాలు, తెలంగాణ అగ్రి గోల్డ్ బాదితుల సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బినామి పేర్లతో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తులను స్వాదీన పరచుకోవాలని కోరారు. అగ్రి గోల్డ్ కంపెనీ మోసాలకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న వారందరికీ రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, అగ్రి గోల్డ్ కంపెనీ వేసిన వెంచర్లలో ఇళ్ల స్థలాలు, భూములు కొనుగోలు చేసి రిజిస్టర్ అయిన వారందరికి స్థలాలను, ఆ భూములను అటాచ్మెంట్ నుంచి తొలగించి యజమానులకు అప్పగించాలన్నారు. బాధితులు విజయం సాధించే దాకా పోరాటం చేయాల్సిందే అన్నారు. ప్రభుత్వమే సంస్థలకు అనుమతి ఇస్తుందని, కానీ ఆ సంస్థలు ఆర్థిక నేరాలకు పాల్పడినప్పుడు కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సీఎస్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున వ్యూహాత్మకంగా ఆందోళనను రూపొందించు కోవాలన్నారు, సెక్రటేరియట్ ముట్టడి, సీఎం ఆఫీస్ ముట్టడి ఆందోళనలను చేపట్టాలన్నారు. జులై 28 లోపు ఉద్యమ కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించారు. జులై 20న ఆన్‌లైన్ మీటింగ్ ఉంటుందన్నారు. ధర్నాకు టి.ఆనంద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో తెలంగాణ అగ్రి గోల్డ్ బాదితుల సంఘం కార్యదర్శి జీ.వెంకటేశ్వర్లు, ఏపీ హ్యూమన్ రైట్స్ నేత మల్లారెడ్డి, హ్యూమన్ రైట్స్ తెలంగాణ జీవీఆర్, రైతు సంఘం నేత నరేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామికాభివృద్ధికి కేంద్రం అండగా నిలవాలి

## పీయూష్ గోయల్‌కు మంత్రి శ్రీధర్ బాబు వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' లక్ష్యాల సాధనకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కోరారు. భవ్య స్కీం ఫేజ్1లో రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పించడంతో పాటు ఏరోడిఫెన్స్ కారిడార్, రెండు మెగా లెదర్ పార్కులు, హైదరాబాద్‌లో నేషనల్ డిజైన్ సెంటర్ ఏర్పాటు వంటి కీలక ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో సోమవారం పీయూష్ గోయల్‌తో ప్రత్యేకంగా సమావేశమైన మంత్రి శ్రీధర్ బాబు రాష్ట్ర పారిశ్రామిక రంగ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై వినతిపత్రం సమర్పించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ఇండస్ట్రియల్ ఎకోసిస్టంను బలోపేతం చేస్తున్నామని, వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో రూ.8,500 కోట్ల పెట్టుబడితో హ్యుందాయ్ గ్రూప్ గ్లోబల్ ఇన్నోవేషన్, ఆర్అండ్‌డీ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన నేపథ్యంలో అక్కడ లాజిస్టిక్ హబ్ అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు. భవ్య పథకం ఫేజ్1 కింద రాష్ట్రంలో 15 నుంచి 20 ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధికి డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నామని, జూన్ జూలై 2026 దరఖాస్తు విండోలోనే వాటికి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి ఏరోడిఫెన్స్ కారిడార్ మంజూరు చేయాలని, హైదరాబాద్‌లో నేషనల్ డిజైన్ సెంటర్ ఏర్పాటుకు కేంద్రం చొరవ చూపాలని కోరిన మంత్రి, మెగా లెదర్, ఫుట్‌వేర్ అండ్ యాక్సెసరీస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ పథకం కింద రెండు మెగా లెదర్ పార్కులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మెదక్ జిల్లా మనోహరాబాద్‌లో రూ.2,050 కోట్లతో ఎన్‌హెచ్ఎల్ఎంఎల్ భాగస్వామ్యంతో ప్రతిపాదించిన మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కుకు ఆమోదం తెలపాలని, రంగారెడ్డి జిల్లా కోహెడలో ఏర్పాటు చేస్తున్న ఇర్రేడియేషన్ ఫెసిలిటీకి ట్రేడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ ఎక్స్‌పోర్ట్స్ పథకం కింద నిధులు కేటాయించాలని కోరారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే మొత్తం యూరియాను తెలంగాణకే కేటాయించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని శ్రీధర్‌బాబు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత ఏడాది ఎరువుల సరఫరాలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.

# ఉద్యోగుల విలీనం ముందే చేపట్టాలి

## సిఎంకి వినతి పత్రం అందజేసిన జెఎసి నాయకులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ఆర్‌టిసి) ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ఎన్నికల కంటే ముందుగా ప్రారంభించాలని ఆర్‌టిసి జెఎసి నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చిందని వారు గుర్తు చేశారు. అనంతరం సమ్మె చర్చల సమయంలో మంత్రుల సబ్ కమిటీ, ఐఏఎస్ అధికారుల కమిటీ ట్రేడ్ యూనియన్లతో జరిపిన సమావేశంలో విలీన ప్రక్రియకు అంగీకరిస్తూ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపిందన్నారు. మే 1న జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి స్వయంగా విలీనం లేదా గుర్తింపు సంఘ ఎన్నికలు అనే అంశంపై కార్మిక సంఘాల అభిప్రాయాన్ని కోరగా, అన్ని కార్మిక సంఘాలు ఎన్నికల కంటే ముందుగా విలీనమే చేపట్టాలని కోరినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు విలీన అంశంపై ఎలాంటి చర్యలు చేపట్టలేదని, అధికార యంత్రాంగం మాత్రం విలీనానికి ముందే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ వినతిపత్రంపై జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎం.డి.మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి సంతకాలు చేశారు. వినతిపత్రం ప్రతులను మంత్రుల సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జి.వివేక్ వెంకటస్వామిలకు కూడా పంపించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.



# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ 25 నుంచి ప్రారంభం

## ఇంటింటికీ బిఎల్‌ఓలు... ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫాం తప్పనిసరిగా పూరించాల్సిందే

## హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఈనెల 25 నుంచి ప్రారంభం కానుందని జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ తెలిపారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కర్ణన్ మాట్లాడుతూ ఈ ప్రక్రియలో భాగంగా ఈనెల 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్‌ఓలు) ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేస్తారని చెప్పారు. ప్రతి ఓటరు ఆ ఫారమ్‌ను తప్పనిసరిగా పూరించి, బిఎల్‌ఓలకు తిరిగి అందజేయాల్సి ఉంటుందన్నారు. ఓటరు అందుబాటులో లేకపోతే కుటుంబ సభ్యులు ఫారమ్ పూర్తి చేసి, సంతకం చేసి ఇవ్వవచ్చని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారమ్‌ను ఆన్‌లైన్‌లో కూడా పూరించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. 2002 నాటి ఓటరు హక్కు ఆధారంగా తల్లిదండ్రులు లేదా తాతముత్తాతలలో ఎవరో ఒకరి వివరాలను ఎన్యూమరేషన్ ఫారమ్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఫారమ్‌ను పూర్తి చేసి, బిఎల్‌ఓకు ఇవ్వని వారి పేర్లు ఎస్ఐఆర్ ముసాయిదా జాబితాలో చేర్చరన్నారు. ఎన్యూమరేషన్ ఫారమ్‌ను తాజా ఫొటోను అతికించి సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు ఎస్ఐఆర్ మ్యాపింగ్ 46 శాతం పూర్తయిందని, అయితే మ్యాపింగ్‌లో లేకపోయినా ఎన్యూమరేషన్ ఫారమ్ సమర్పించిన వారినే తుది జాబితాలో పరిగణనలోకి తీసుకుంటామన్నారు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 4,062 మంది బిఎల్‌ఓలు పనిచేస్తుండగా, అన్ని రాజకీయ పార్టీల తరఫున 10,901 మంది బిఎల్ఏలు నియమితులయ్యారని చెప్పారు. బిఎల్‌ఓలతో పాటు బిఎల్ఏలు కూడా ఓటర్ల వద్దకు వస్తారని, వారికి గుర్తింపు కార్డులు జారీ చేస్తామని చెప్పారు. ఎన్యూమరేషన్ ఫారమ్ సమర్పించే సమయంలో ఎలాంటి అదనపు ఆధారాలు బిఎల్‌ఓలకు ఇవ్వాల్సిన అవసరం లేదని కర్ణన్ స్పష్టం చేశారు. అయితే ఫారమ్‌ను తప్పుగా నింపినా లేదా సమర్పించకపోయినా సంబంధిత ఓటర్లకు ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) నోటీసులు జారీ చేస్తారని చెప్పారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని, ఆ తర్వాత ఆగస్టు 30 వరకు నోటీసులు అందుకున్న వారు భారత ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి ఈఆర్ఓ ఎదుట సమర్పించాల్సి ఉంటుందన్నారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఒక్క వ్యక్తికి ఒక్క ఓటు హక్కు మాత్రమే ఉండాలని, ఓటు ఎక్కడ ఉందో అక్కడే ఎన్యూమరేషన్ ఫార్మ్ నింపి ఇవ్వాలన్నారు. బిఎల్‌ఓలు విధుల్లో నిర్లక్ష్యం లేదా తప్పులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# దేవాలయాల ప్రాంగణాలే కళలకు అసలైన వేదికలు

## రవీంద్ర భారతిలో ఘనంగా 'అర్థనారీశ్వరం' జాతీయ నృత్యోత్సవం

## కళాకారులను సత్కరించిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రాచీన కళలు, సంస్కృతిని కాపాడుకుంటూనే కళాకారులకు ఉపాధి కల్పించేలా దేవాదాయ, పర్యాటక, సాంస్కృతిక శాఖలు ఒక ప్యాకేజీ రూపంలో సమన్వయంతో ముందుకు సాగాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. గతంలో లలిత కళలన్నింటికీ దేవాలయాల ప్రాంగణాలే ప్రధాన వేదికలుగా ఉండేవని గుర్తు చేశారు. ఆనాడు పాలకులు సమాజానికి ఇవ్వాలనుకున్న భక్తిభావనను, సామాజిక సందేశాలను నృత్య, కళా రూపాల ద్వారా ప్రజలకు రక్తికట్టేలా సులువుగా అర్థమయ్యేలా వివరించేవారని కొనియాడారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో సోమవారం నిర్వహించిన 'అర్థనారీశ్వరం నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడుతూ సాంస్కృతిక, పర్యాటక, దేవాదాయ శాఖలు చేతులు కలిపి ఉమ్మడి కార్యక్రమాలు చేపడితే తెలంగాణలో అద్భుతమైన ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కేరళ తరహాలోనే తెలంగాణలోనూ పర్యాటక ప్రాంతాల్లో స్థానిక కళలను ప్రదర్శించేలా సరికొత్త వ్యవస్థను తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్రంలో పర్యాటకులు సందర్శించే ప్రదేశాలలో సాయంత్రం వేళల్లో మన సంప్రదాయ కళారూపాలను ప్రదర్శిస్తే, అటు పర్యాటకులకు వినోదంతో పాటు ఇటు మన కళాకారులకు ఉపాధి, తగిన ప్రోత్సాహం లభిస్తుందన్నారు.

**పురుషాధిక్యత కాదు.. సమానత్వమే 'అర్థనారీశ్వరం'**

ప్రస్తుతం జరుగుతున్న 'అర్థనారీశ్వరం' ప్రదర్శనపై స్పందిస్తూ భారతీయ సంస్కృతిలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేననే ఉదాత్తమైన భావనను ఇది చాటుతుందని చెప్పారు. సృష్టిలో పురుష శక్తి, స్త్రీ శక్తి కలిసి సాగాలని, ఒకరికొకరు గౌరవించుకుంటూ, కాంప్లిమెంట్ చేసుకుంటూ కలిసి పని చేస్తే ఆ శక్తిని మించింది ఏదీ లేదనే గొప్ప సందేశం ఇందులో ఉందని కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజల తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన యువతకు ఉపాధి బాటలు.. ఎన్ఐటిఎచ్ఎంలో హాస్పిటాలిటీ శిక్షణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామీణ, గిరిజన యువతకు స్థిరమైన జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టిజిఎఫ్‌డిసి) ఆధ్వర్యంలో నిర్వహించిన 15 రోజుల హాస్పిటాలిటీ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం సోమవారం విజయవంతంగా ముగిసింది. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక ఉత్సవాల్లో భాగంగా 'డెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్' బ్రాండ్ కింద నిర్మాణ్ ఆర్గనైజేషన్ సహకారంతో గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎన్ఐటిఎచ్ఎం)లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ములుగు, వికారాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన 32 మంది గిరిజన, ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగ యువతకు వంట, ఫ్రంట్ ఆఫీస్ ఆపరేషన్స్, హౌస్‌కీపింగ్, ఫుడ్ అండ్ బెవరేజ్ సర్వీస్ రంగాల్లో వృత్తిపరమైన శిక్షణ అందించారు. ముగింపు కార్యక్రమానికి టిజిఎఫ్‌డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎకోటూరిజం విభాగం మరియు తెలంగాణ పర్యాటక శాఖ డైరెక్టర్ ఎల్.రంజిత్ నాయక్, ఐఎఫ్ఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్ఐటీఎచ్ఎం డైరెక్టర్ ప్రొఫెసర్ వి. వెంకటరమణ గౌరవ అతిథిగా, నిర్మాణ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు, గ్లోబల్ సీఈఓ మయూర్ పట్నాల ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ, శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని అభ్యర్థులు తమ వృత్తిపరమైన ఎదుగుదలకు ఉపయోగించుకోవాలని సూచించారు. ఎల్.రంజిత్ నాయక్ మాట్లాడుతూ, ఎకోటూరిజం రంగంలో పెరుగుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా స్థానిక, గిరిజన యువతకు నైపుణ్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అంకితభావం, క్రమశిక్షణ, నిరంతర శ్రమతోనే విజయాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్ సిఇఒ మయూర్ పట్నాల మాట్లాడుతూ, విద్య, శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పన ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడమే తమ సంస్థ లక్ష్యమని చెప్పారు.

# రాష్ట్రంలో వారం రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న వారం రోజుల పాటు వర్షాలు విస్తృతంగా కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, కొన్నిచోట్ల భారీ వర్షాలు, ఉరుములు– మెరుపులతో పాటు గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని హెచ్చరించారు. సోమవారం నుంచి శనివారం వరకు దశలవారీగా ఉత్తర, మధ్య, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, మెదక్, కామారెడ్డి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, హైదరాబాద్, రంగారెడ్డి తదితర జిల్లాలకు హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. ఇక ఉష్ణోగ్రతలు కూడా రానున్న నాలుగు రోజుల్లో 2 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశముందన్నారు.

# టిజిపిఎస్‌సి స్థానికత విధానంపై హైకోర్టు ఆక్షేపణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉద్యోగ నియామకాల్లో స్థానికత నిర్ధారణ విషయంలో టిజిపిఎస్‌సి అనుసరిస్తున్న భిన్న ప్రమాణాలను తెలంగాణ హైకోర్టు తప్పుబట్టింది. ఒకే అంశంలో వేర్వేరు సందర్భాల్లో వేర్వేరు కారణాలతో స్థానికతను నిరాకరించడం చట్టబద్ధం కాదని స్పష్టం చేసింది. రాష్ట్రపతి ఉత్తర్వుల నిబంధనలను సమగ్రంగా అమలు చేయాలని, స్థానికత నిర్ణయంలో ఒకే విధమైన ప్రమాణాలు పాటించాలని ఆదేశించింది. 2022 ఏఈఈ నియామకాల వ్యవహారంలో అభ్యర్థి పి.నిశాంత్‌ను స్థానికుడిగా గుర్తించాలని ఇచ్చిన సింగిల్ జడ్జి తీర్పును సమర్థిస్తూ టిజిపిఎస్‌సి అప్పీల్‌ను డివిజన్ బెంచ్ కొట్టివేసింది.

# ఐడిపిఎల్ భూముల వివాదంలో రాష్ట్రానికి నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఐడీపీఎల్‌కు కేటాయించిన 891.38 ఎకరాల భూముల స్వాధీన వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. భూముల స్వాధీనానికి సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను జూలై 13కు వాయిదా వేసింది. భూమిపై పూర్తి హక్కులు తమకేనని ఐడీపీఎల్ వాదించగా, పారిశ్రామిక అవసరాల కోసం కేటాయించిన భూమిని ఇతరులకు లీజుకు ఇవ్వడంతో స్వాధీన చర్యలు చేపట్టామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది.

# రోడ్డు స్థలాలకు క్రమబద్ధీకరణ వర్తించదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లేఔట్లలో రోడ్లు, ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాలకు క్రమబద్ధీకరణ పథకాలు వర్తించవని హైకోర్టు స్పష్టం చేసింది. రోడ్డు కోసం నిర్దేశించిన స్థలాన్ని ఎల్ఆర్ఎస్ లేదా ఇతర రెగ్యులరైజేషన్ పథకాల కింద క్రమబద్ధీకరించలేమని పేర్కొంది. అలాగే రిజిస్ట్రేషన్ పత్రాలను ఏకపక్షంగా రద్దు చేయడం చెల్లదని, సంబంధిత పక్షాలకు నోటీసులు ఇచ్చి చట్టపరమైన ప్రక్రియను అనుసరించాలని తెలిపింది. గుట్టలబేగంపేటలోని ఓ స్థల వివాదానికి సంబంధించిన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తు తిరస్కరణను సమర్థిస్తూ ఈ మేరకు తీర్పు వెలువరించింది.

